# తుఫానులో జవరాలు

"ప్రమీల"

కథానిక

ఆ ఆడపిల్లల హాస్టలులో ఆర్ట్సు కాలేజీలోను, ట్రెయినింగ్ కాలేజీలోను చదివే అమ్మాయిలు ఉంటారు. ఆర్ట్సు కాలేజీలో పని చేసే లెక్చరర్ కామేశ్వరమ్మగారే ఆ హాస్టలు వార్డెన్. అక్కడ అంతా కలిపి ఒక పాతికమంది కన్నా ఎక్కువ ఉండరు. దాన్ని చూస్తే ఏదో ఒక పెద్ద కుటుంబంలాగా అనిపిస్తుంది. వాళ్లు కూడా అలానే అన్యోన్యంగా ఉంటారు.

అందులో ఒక నలుగురు చాలా కలివిడిగా తిరిగేవారు. వాళ్లు ఆర్ట్సు కాలేజీలో బి.ఏ.సీనియర్ చదువుతున్నారు. వాళ్ళు అంతా ఒకే రూమ్‌లో లేకపోయినా ఎప్పుడూ ఒకదగ్గరే కనిపిస్తూ చాలా హుషారుగా ఉండేవాళ్ళు. అందులో లక్ష్మి, హైమం, బరంపురంనుండి; మీన, జానకి విశాఖ పట్నంనుండి వచ్చేరు. వీళ్లు నలుగురూ ఎప్పుడూ నవ్వుతూ, పేలుతూ హాస్టల్‌కి ఒక అలంకార ప్రాయంగా ఉంటూ, వాళ్ళల్లో సంతోషం మూర్తీభవించిందా అనేటట్లు ప్రవర్తించేవారు.

ఒకసారి శని, ఆదివారాలు కలుపుకొని నాలుగు రోజులు సెలవులు వచ్చాయి. దగ్గర ఊళ్ళలో, అంటే కాకినాడ, అమలాపురం ప్రాంతాలవాళ్లు యిళ్ళకు వెళ్ళిపోయారు. కాస్త దూరంగానున్న బరంపురం, విశాఖ సోదరీమణులైన యీ నలుగురూ మాత్రం వెళ్ళలేదు. హాస్టలంతా ఖాళీఅయింది. వీళ్ళకేమీ తోచడంలేదు. లక్ష్మి ఇలాఅంది:

"ఏమర్రా అత్తతో కాస్సేపు బాతాఖానీ వేద్దాం. అలాగైనా కాలం గడుస్తుందేమో!" (వార్డెన్‌గారిని అత్త అనటం వాళ్ళకి పరిపాటి అయింది. బహుశా ముద్దు గాబోలు) అందరూ ముఖాలు రుద్దుకు, నీటుగా ముస్తాబయి వార్డెన్ గారి క్వార్టర్సువైపు నడిచారు.

కామేశ్వరమ్మగారు మధ్య వయస్సులో నున్న వ్యక్తి. చిన్నతనంలోనే భర్తను పోగొట్టుకుంది. కాని విధవలా కనుపించదు. ఆవిడ పిల్లల్ని చూడగానే—

"రండమ్మాయ్! బహుశా మీకేమీ తోచడం లేదనుకుంటా." అంది.

"అవునండీ! ఏమీ తోచడంలేదు" అంది మీన.

"అయితే రేపు మనం గోదావరిమీద బోటింగ్‌కు వెళదాము. గోదావరిలో నీరు కాస్త తగ్గిందిగా. పొద్దుట భోజనాలు ముగించుకు, ఏదో టిఫెన్ పట్టుకువెళ్ళి కాస్సేపు హాయిగా ఆ బొబ్బర్లంకలో గడిపివద్దాం. ఏమంటారు?"

ఈమాట వినగానే నలుగురూ ఒక్కసారి గెంతినంత పనిచేసి సరేనంటే సరేనన్నారు. అంతలో మీన—

"ఈ ప్రోగ్రాము రేపటిదికదండీ! ఇవాళ పిక్చరుకి వెళ్ళివస్తాం" అంది.

"పిక్చర్ ఏమిటి?"

"జయాటాకీస్‌లో 'పక్కింటి అమ్మాయి' అవుతోంది. దానికి వెళ్తాం."

"సరే! జాగ్రత్తగా వెళ్ళిరండి." అని వాళ్ళని సాగనంపారు కామేశ్వరమ్మగారు.

* * *

వీళ్లు తిరిగి వచ్చేసరికి రాత్రి తొమ్మిదిన్నర అయింది. సాధారణంగా సినిమా చూసి వచ్చిన తర్వాత

దానిమీద చర్చ జరగటం మామూలు. ఆ నలుగుర్లో మీన చాలా గడుగ్గాయ. ఆవిడకు తెలియనిదంటూ లేదు. చాలసేపు రేలంగి హాస్యం మీద, రాజా సంగీతంమీద ఏమేమో వాగారు. అంతలో నిద్ర ముంచుకొచ్చిందేమో, ఎవరి మట్టుకు వాళ్ళు నిశ్శబ్దంగా నిద్రాదేవి ఒళ్ళో చేరారు.

ఈ ఆడపిల్లల అందచందాలు వర్ణించనవసరం లేదు. ఎందుకంటే ఆ వయస్సులో ఉన్నప్పుడు ఆడపిల్లలంతా అందంగా, ఆకర్షణీయంగానే కనిపిస్తారు. ఈ నలుగురూ అందుకు ఏమాత్రం తీసిపోరు. కాని మీనలో మాత్రం ఒక ప్రత్యేకాకర్షణ ఉంది. ఆవిడ కళ్లు చాలా భాషలు మాట్లాడగలవేమో ననిపిస్తుంది. ఆ కళ్ళల్లో ఒక విధమైన మెరుపుఉంది. అందువల్ల ఆమెతో మాట్లాడడమంటే తోటివారికి అదో సరదా.

* * *

ఆ మర్నాడు అనుకున్నట్టుగానే అంతా బోటింగుకు వెళ్ళడానికి ముస్తాబవుతున్నారు. నలుగురూ మంచి చీరలు కట్టుకున్నారు. అందరికన్నా మీన ముందు తయారయింది.

"ఏమర్రోయ్! ఆలస్యం చేసారంటే అత్త చంపుతుంది. త్వరగా తెమలండి" అంటూ అందర్నీ తొందర పెట్టసాగింది.

ఆఖరికి అంతా వార్డెన్‌గారి క్వార్టర్సుకు వెళ్ళారు. అప్పటికే ఆవిడ తయారుగా ఉంది. రెండు పిక్నిక్ బుట్టలు నిండుగా తినుబండారాలు, ఒక ఐస్‌క్రీమ్ ఫ్లాస్కు అమర్చి ఉన్నాయి. కాని యీ నలుగురికీ కాస్త ఆశ్చర్యం కలిగించిందేమంటే కామేశ్వరమ్మగారి మేనల్లుడు అక్కడ హాల్లో కూర్చున్నాడు. చక్కగా డ్రెస్ చేసికొన్నాడు. ఇంతకు ముందు వీరు అతన్ని అప్పుడప్పుడూ చూస్తూనే ఉండేవారు. కాని యిప్పుడు ముఖాముఖి చూసుకోవడమన్నమాట. అబ్బాయి చక్కగా ఉంటాడు. ఆడవాళ్లు అతన్ని చూడగానే కాస్త చలిస్తారనేది నిజం! కాని యీ నలుగురు నవయువతీ మణులు వెళ్ళినా అతడేమీ చలించినట్టు కనబడలేదు. ఇంతలో కామేశ్వరమ్మగారు గదిలోనుండి హాల్లోకివచ్చి అబ్బాయిని వీళ్ళకు పరిచయం చేసింది. అతనుకూడా వీళ్ళతో బోటింగ్‌కు వస్తున్నాడట. అతని పేరు మురళీ మోహన్.

లాంచీల రేవు వీళ్ళ హాస్టలుకు దగ్గరే. అందుకని బుట్టలు వ్యాన్‌తో పంపి వీళ్ళు నడిచే బయలుదేరారు. ముందు కామేశ్వరమ్మ, మోహన్ నడుస్తున్నారు. వెనుక కాస్త దూరంలో వీళ్ళు నలుగురూ వస్తున్నారు. మీన నెమ్మదిగా ముందు వెళ్ళేవాళ్ళకు వినబడకుండా తక్కిన స్నేహితురాళ్ళతో యిలా అంది:

"అయితే మనకూ ఒక సుబ్బారాయుడు తటస్థించాడన్నమాట!"

"అవును, మరి! సుబ్బారాయుడు లేకపోతే పిక్నిక్ ఏమిటి లెద్దూ!" అంది జానకి.

"కాదూమరి! 'పక్కింటి అమ్మాయి'లో అంజలీ వాళ్ళకు ఒక సుబ్బారాయుడు. ఇక్కడ మనకు మరొక సుబ్బారాయుడు. బాగుంది కదూ!" అంది లక్ష్మి.

ఇలా అనుకుంటూ నవ్వుకుంటూ లాంచీల రేవుకి వెళ్ళారు. కాని వీళ్లు దగ్గర పడుతుండగానే లాంచి రేవును విడచి పెట్టేసింది.

'హరి భగవంతుడా' అంటూ ఆ తరువాత లాంచీకోసం నిరీక్షిస్తూ అక్కడేఉన్న ఒక చెట్టు క్రింద కూలబడ్డారు.

'మన పిక్నిక్ ఇక్కడ నుండే ప్రారంభం' అంటూ లక్ష్మి ఒక బిస్కట్ తీసి తిన నారంభించింది. టైమ్‌కి సర్గ్గా ఆఖరి లాంచి బయలుదేరింది. వీళ్ళు ఎక్కారు. నీటిని ఛేదించుకొంటూ లాంచి శబ్దం చేసికొని వెళ్తూంటే ఒకరిమాట ఒకరికి స్పష్టంగా వినబడటంలేదు. గాలికి చిన్న తుంపరలు ముఖంమీద పడుతూంటే చాలా ఆహ్లాదకరంగాఉంది. వీళ్లు నలుగురు నవ్వుతూ, ఏమేమో ఒకరితో నొకరు మాట్లాడుతూ ఉండగానే లాంచి బొబ్బర్లంక చేరింది.

నలుగురూ నాలుగు వస్తువులూ పట్టుకొని, చెట్లు గుబురుగా ఉన్నచోట మకాంవేశారు.

"అమ్మాయ్! ఇప్పటినుండీ తినటం మొదలు పెడితేనేకాని, ఇవన్నీ అవవు. కానివ్వండి." అంది కామేశ్వరమ్మ. తినటం పూర్తి అయిం తర్వాత నలుగురూ అలా వెళ్ళొస్తామని చెప్పి

ముందుకు సాగారు. ఒకచోట గోదావరిలోకి పెద్దరాళ్ళు గుట్టగాపోసి ఉన్నాయ్. బహుశా గట్టువేయటానికేమో! ఆ రాళ్ళమీద నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ చివరకాదాపోయి కూర్చున్నారు. మీన, హైమం కాళ్ళు నీళ్ళలోపెట్టి ఆడిస్తున్నారు. నీళ్ళు చింది వాళ్ళమీద పడ్తున్నాయ్. తక్కిన యిద్దరూ కాస్తఎగువగా కూర్చున్నారు. వాతావరణం ప్రశాంతంగా ఉంది. ఆ చల్లని గాలికి వాళ్ళ ముంగురులు స్వాధీనం తప్పి యిష్టమొచ్చినట్లు వాళ్ళ ఫాలభాగాలపై నాట్యం చేస్తున్నాయి. వాళ్ళ చీరలుకూడా గాలికి రెపరెప కొట్టుకొంటూ ఒక విధమైన శబ్దం చేస్తున్నాయి. ఆ నలుగురూ ఏవో కూని రాగాలు తీస్తూ వాళ్ళలో వాళ్ళే తన్మయం చెంది ప్రకృతిని తిలకిస్తూ కూర్చున్నారు. టైమ్ ఎంత అయిందీ వాళ్ళకు తెలియలేదు. యింతలో అకస్మాత్తుగా జానకి టైం చూసుకొంది...అబ్బో! ఆరు!...

"ఏమర్రోయ్! ఇక లేవండి. ఆరు అయిపోయింది. మన అత్తా, సుబ్బారాయుడూ ఏంచేస్తున్నారో, ఏమిటో! గొడవ!" అని ఒక్క అరుపు అరిచేసరికి అంతా యీ లోకంలోకి వచ్చి పడ్డారు.

నలుగురూ లేచి వాళ్ళ వార్డెను తిడుతుందేమో నన్న భయంతో గబగబ నడవసాగారు. అక్కడకు వెళ్లేసరికి కామేశ్వరమ్మ, మోహన్, ఆ చెట్టు కిందే కూర్చుని ఉన్నారు.

"ఆలస్యం అయిందండీ. టైమ్ తెలసిందికాదు" అంది మీన.

"అయితేనేం! ఆఖరి లాంచీ తప్పిపోయింది. ఇప్పుడేం చేస్తాము! ఎలా వెళ్తాం?" అన్నారు కామేశ్వరమ్మగారు.

"ఏదైనా నావ దొరక్కపోదులే అత్తమ్మా!" అన్నాడు మోహన్.

"మేము ఆలస్యం చేయకపోతే లాంచీకి అందే వాళ్ళమేమో!" అని పశ్చాత్తాపంతో కూడిన స్వరంతో అంది హైమం.

"మీ ఒక్కరిదే అతప్పంతా కాదులెండి. మే మిద్దరము కూడా అలా తిరిగిరావటానికని వెళ్ళాము. తిరిగి వచ్చేసరికి లాంచి వెళ్ళిపోయిందన్నారు" వార్డన్ అంది.

అయితే బ్రతికాం—అని ఆ నల్గురూ సంతృప్తి పడ్డారు.

వెలుతురు నెమ్మదిగా తగ్గుతూంది. నావ జాడ లేదు. ఆకాశం కూడా మబ్బు మబ్బుగా ఉంది. ఎందువల్లో మీన హృదయంలో ఆందోళనగా ఉంది. అంతవరకూ నవ్వుతూ, సరదాగా ఉన్న వాళ్ళంతా ఒక్కసారి నిశ్శబ్దంగా అయిపోయి ఏమిటో ఆలోచిస్తూ కూర్చున్నారు.

* * *

చీకటి పడుతూందనగా ఒక నావ రాజమండ్రి బయలుదేరింది. దానిలో వీళ్ళు ఎక్కారు. కొంతమంది పాల వాళ్ళు కూడా ఎక్కారు. నావ కదలబోయే సమయంలో ఒకతల్లి నలుగురు పిల్లలతోటి ఒక చంటివాణ్ణి కూడా ఎత్తుకుని నావ ఎక్కింది.

తెరచాప విప్పారు. గాలికి నావ ఊగుతూ నెమ్మదిగా ముందుకు సాగింది. నావ కొంత దూరం వెళ్ళిందో లేదో, ఆకాశం బాగా మబ్బులమయం అవటం అంతా గమనించారు. గాలి హోరుకూడా ఎక్కువయింది. ఇంకా కాస్సేపు అయ్యేసరికి చిన్న చినుకు ప్రారంభమయింది. నావ సరంగు తెర చాపను దింపివేశాడు. చినుకులతోపాటు ఉరుములు, మెరుపులు కూడా ప్రారంభమయ్యాయి. ఆకాశం అంతా నల్లని తెర కప్పుకొని ఉన్నట్లుగా ఉంది.

ఆడపిల్లల గుండెల్లో ఒణుకు ప్రారంభమయింది. ఆ క్రితంరోజున్నే మీన వాళ్ళ లైబ్రరీలో టాగూర్ రచించిన "రెక్" చదివింది. అదంతా ఆ పిల్ల కళ్ళకు కట్టనారంభించేసరికి మరీ భయం వేయసాగింది. వర్ష తీవ్రం హెచ్చేసరికి నావసరంగు ఆ తెర చాపను ఆడవాళ్లమీద చినుకులు పడకుండా కప్పాడు. వాతావరణం చాలా భయంకరంగా పరిణమించింది. కళ్ళు మిరుమిట్లు గొల్పేటట్లు ఆకాశం మెరవసాగింది. చెవులు చిల్లులు పడేటట్లు ఉరుములు...నావలో ఉన్న చిన్నపిల్లలు ఏడుపు లంకించుకున్నారు. పాపం వాళ్ళు భయంతో ఒణికిపోయి వాళ్ళ అమ్మను గట్టిగా పట్టుకొని ఏడుస్తున్నారు.

తామున్నది నడి గోదావరిలో! వాతావరణం చూస్తే యిలా ఉంది! నిజంగా అప్పుడు ఆ

పడవలో ఉన్నవారి మనః ప్రవృత్తులు వర్ణించాలంటే మాటలు చాలవు. వర్షపు జోరు మరీ హెచ్చయి, తెరచాపలోనుండి ఏకధాటిగా నీరు ఆడవాళ్ళపై కారనారంభించింది. వాళ్ళ చీరలు, తలలు పూర్తిగా తడిసి ముద్దయిపోయాయి.

వాతావరణం ఇంత భీభత్సంగా తయారయిందంటే, పెద్దవాళ్లు కూడా భయపడసాగారు. గాలికి నీళ్లు అలలుగా వచ్చి పడవను ఢీకొంటున్నాయి. ఇక ముందుకు సాగితే ప్రమాదమని సరంగు లంగరు దింపాడు. ఆ పిల్లల తల్లి ఏడుపు నెమ్మదిగా వినవస్తూంది.

"భగవంతుడా! ఈ చిన్నారి పాపలపై నీకు దయలేదా? వీళ్ళను నీళ్ళపాలు చేస్తావా? నన్ను శిక్షించి పిల్లల్ని రక్షించు తండ్రీ!" అని పిల్లలను గుండెలకు అదుముకుంటూ ఏడుస్తూంది.

కామేశ్వరమ్మగారు ఒక మూల ఒదిగి కూర్చున్నారు. ఆవిడకు చనిపోతానేమో అన్న భయం కన్నా, పరాయివాళ్ళ పిల్లలను తీసికొచ్చేనే!-వాళ్ళ సంగతేమిటని కుములుతూంది. ఆవిడది అట్టి బాధ్యతగల స్థానం! ఆ నలుగురు పిల్లలు వెక్కి వెక్కి ఏడవ నారంభించారు. తాము కాలేజీ విద్యార్థినులమని వాళ్ళకు జ్ఞాపకము లేదేమో! ఇంక చావు ఘడియ దగ్గరపడిందని నిర్ధారణ చేసుకొని ఏమీ తోచక తల్లిదండ్రులనూ తోబుట్టువులనూ తలచుకొని ఏడవసాగారు. అందరిలో గడుసుదానిలా ఉండే మీన మరీ జేల అయిపోయింది. కళ్ళు గట్టిగా మూసుకొని, "తండ్రీ! ఇదేమిటి? ఇలాంటి చావు వ్రాశావా?" అని భగవంతుణ్ణి తలుస్తూ గట్టిగా ఏడవ నారంభించింది.

ఇంతలో పడవకు రెండు చిల్లులు పడి కింద నుండీ కూడా నీరు వేగంగా రావటం మొదలు పెట్టింది. మొగవాళ్ళు చేతనయినంతవరకూ లోపలికి వస్తూన్న నీటిని పైకి చేదుతున్నారు. ఈ రంధ్రాలు చూసేసరికి ఎవరికి గుండెల్లేవు. పంచె కొనలు ఆ రంధ్రాల్లో జొప్పించి అప్పటికి నీళ్ళధాటిని కాస్త ఆపారు. పడవ సరంగుకు వెనక్కు పోవటానికిగాని ముందుకు వెళ్ళడానికి గాని కాళ్ళాడటం లేదు.

ఇంతలో ఎందుకో మీన కళ్లు తెరచింది. అంతా చీకటి మయం. ఎక్కడచూచినా నీరు తప్ప మరేమీ కనిపించటంలేదు. ఎదురుగ్గా మోహన్ తెరచాపకొయ్య పట్టుకొని నిలబడి ఉన్నాడు. అంతవరకూ అతడొకడు తమతో వచ్చాడన్న సంగతే మర్చిపోయింది మీన. అతన్ని చూడగానే ఆమెకు పోయిన ప్రాణాలు లేచి వచ్చినట్లనిపించింది. ఆరోజంతటిలో ఒక్క మాట మాట్లాడకపోయినా, అతన్ని చూడగానే ఆత్మీయునిగా భావించి, అతని చెయ్యి గట్టిగా పట్టుకొని ఏడ్వ నారంభించింది. మోహన్ ఆశ్చర్యపోయాడు. అంతవరకూ మీన ఏడుస్తుందని తాననుకోలేదు. అందరి కంటే చలాకీగా మాట్లాడుతూ, చాలా ధైర్యస్థురాలిగా తనకు కనబడింది. ఇప్పటి మీనను చూస్తే మోహన్‌కి జాలి వేసింది.

"అయ్యో! అదేమిటండీ! అలా ఝడిస్తే ఎలా? ఏం ఫర్వాలేదు. ఏడవకండి. మీరేదో చాలా ధైర్యవంతులనుకున్నాను. భలేవారే!" అని తలపై నిమురుతూ దగ్గరగా నిలబడ్డాడు.

అంత దగ్గరగా ఒకవ్యక్తి, అందులోనూ మగవాడు, ఉండగానే మీనకు చాలా ధైర్యం వచ్చింది.

పాత్రుడుగారి
బాలసంజీవిని
[REGD.]
పిల్లల లివర్ & స్ప్లీను వ్యాధులను నివారించును.
డాక్టరు పిళ్లా పాపయ్యపాత్రుడు అండ్ బ్రదర్స్
19 దక్షిణ మాడవీధి-మైలాపూరు
మదరాసు-4. ఫోన్ నెం. 71354
బ్రాంచి:— 7, సారంగపాణికోవిల తూర్పువీధి
కుంభకోణము.
అన్ని మందుల షాపులలోను దొరుకును.

వొళ్ళంతా తడిసి ముద్దయింది. దానికి తోడు చలి గాలి! దేహమంతా గజగజా వణికిపోతూవుంది. దుఃఖాతో జీరబోయిన గొంతుకతో వణుకుతూ "చాలా భయంగా ఉన్నదండీ" అని అతని చేతిని మరింత గట్టిగా పట్టుకొంది.

ప్రాణాపాయంలో ఉన్నప్పుడు స్త్రీ అన్నిటి కన్న ముఖ్యంగా పురుషుని సహాయాన్ని కాంక్షిస్తుందేమో!

నావలో ఉన్నవారంతా పడవను వెనక్కి తిప్పమని చెప్పటంవల్ల సరంగు బొబ్బర్లంక వైపు చాలా కష్టంతో నావను నడుపసాగాడు. ఏ క్షణాన్న ఏమవుతుందోనన్న భయం అందరిలోనూ వ్యక్తమవుతూంది. ఎలాగైతేనేం, నావ రేవు చేరుకుంది. ఆడవారిని మొగవాళ్లు సాయంపట్టి గట్టు చేర్చారు. ఎందుచేతనంటే, వర్షానికి గట్టు తెగి అంతా బురద, బురదగా జారుతూ ఉంది.

గట్టు చేరగానే కామేశ్వరమ్మగారు ఆ నలుగుర్నీ తన పొదివిలో చేర్చి గట్టిగా అదుముకుంటూ ఏడ్చింది. బతికి బయట పడ్డందుకై వచ్చిన ఆనంద బాష్పాలై ఉంటయ్.

ఆరాత్రి వాళ్ళు ఆరుగురూ అక్కడే ఉన్న ఒక సత్రంలో బస చేసారు. ఊళ్లోవాళ్ళు ఏవో చీరలు తెస్తే తడిబట్టలు విప్పి పొడివి కట్టుకొని ఆ రాత్రంతా ఎలాగో గడిపారు.

* * *

తెల్లవారింది. రాత్రి ఏమీ జరగనట్టే ఆకాశం ప్రశాంతంగా ఉంది. సూర్యుడు నెమ్మదిగా పైకి వస్తున్నాడు. రాత్రి నావలో ప్రయాణం చేసిన వాళ్లు యిద్దరు సత్రంలో ఉన్న వీరివద్దకు వచ్చారు.

"అమ్మగారూ! మీలో యారో చాలఅదృష్టమంతురాలున్న దమ్మగారు. లేకపోతే కేలిరి ఏట్లైపోదుమో! ఆ గంగాభవాని రక్షించింది" అని అంటున్నారు.

కాని మీనకు ఇవేవీ చెవికి సోకటంలేదు. రాత్రి తన ప్రవర్తన తలంచుకుంటే సిగ్గుతో నవనాడులూ కుంగిపోతున్నాయి.

"ఛీ! ఎలాంటి పనిచేసింది తను. చస్తే చచ్చి ఉండవలసింది. అతనిచెయ్యి పట్టుకున్నదే! అతనే మనుకుంటున్నాడో! తన్నెంత నీచంగా చూస్తున్నాడో" అని ఒకటే ఆలోచన.

ఎనిమిది గంటలకు ఒక లాంచి రాజమండ్రి వెళ్తుంటే వీళ్లుకూడా ప్రయాణమయ్యారు. అమ్మాయిల చీరలు రూపు లేకుండా ధ్వంసమయ్యాయి. కాని ఎలాగో ఇంటికి చేరితే అదే పదివేలు అని బయలుదేరారు. తెల్లవారిన దగ్గరనుండీ మీన ఎవరిముఖమూ చూడలేకపోతూంది. ముఖ్యంగా మోహన్‌ది. కాని మోహన్ మాత్రం ఏమీ జరగనట్లే తిరుగుతున్నాడు. సవ్యంగా, సకాలంలో లాంచి రాజమండ్రి చేరుకుంది.

* * *

హాస్టల్‌కు వచ్చిన దగ్గర నుండీ మీన ఎవరితోనూ మాట్లాడక ముభావంగా ఉండటం తక్కిన ముగ్గురూ గమనించి, "అలాగున్నావేం?" అని అడిగారు.

"అబ్బే! ఏంలేదే!" అంది మీన.

కాని అసలు జరిగిన సంగతి ఎవరికైనా చెప్పి తన హృదయంలోగల ఆ బరువు కాస్త దించుకుందామనుకుంది మీన. ఆ నలుగురిలోనూ లక్ష్మి కాస్త వయస్సులో పెద్దది. మీన లక్ష్మిని చాటుగా పిలచి జరిగిందంతా చెప్పింది. లక్ష్మి నవ్వసాగింది.

"ఎందుకే నవ్వుతావ్! నేను సిగ్గుతో చస్తూంటే!"

"ఆ! ఏంలేదు. ఏదో చావుతప్పి కన్ను లొట్టబోయి మనం వస్తే, నీకీ పిచ్చిభయం ఏమిటా? అని. అవునుగాని, అందులో నీవు సిగ్గుపడాల్సినదేముందే! పిచ్చిదానా! అతడు నీ అన్నఅయిఉంటే ఏంచేసేదానవో, అదే చేసావు. అంతే!"

"కాని, అతనలా అనుకోవద్దూ! నా గురించి చెడ్డగా తలుస్తున్నాడేమో!" అంది మీన... కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నయ్.

"ఛీ! అతనలాంటివాడు కాదు. ఇవాళ లాంచి ఎక్కక ముందు చూడరాదూ! ఎంత ప్రశాంతంగా కనబడ్డాడో! అతనిలో అలాంటి చెడు తలంపులు లేవని నేను గట్టిగా చెప్తాను. తెలిసిందా! ఇంక నీ పిచ్చి ఊహాలకి ఫుల్‌స్టాప్ పెట్టి కాస్త రెస్టుతీసుకో. నీకు అంతగా నమ్మకం కుదరకపోతే, అతనితో నే చెప్పిస్తాను. సరేనా!" అంది లక్ష్మి.

"తల్లీ! నీకో నమస్కారం! అలాంటి పిచ్చిపని మాత్రం చెయ్యకు!" అంది మీన నవ్వుతూ...

ఆ రాత్రి మీన ప్రశాంతంగా నిద్రపోయింది.